# లలిత శపథం

శ్రీమతి దుగ్గిరాల వెంకటసుబ్బమ్మగారు

రాజ్యంవద్దనుంచి సమాధానంకోసం ఉవ్విళ్లూరుతూంది లలిత. నిజంగా రాజ్యమంటే చిన్నతనంనుంచి లక్ష్యమున్నూ, నమ్మకమున్నూ, ఉండేది. ఆటపాటల్లోకూడా మంచి "జోస్తీగా" వుండేవాళ్లు. ఒకటే మనస్సు. ఒకటేమాట. అట్లాజరిగింది చాలాకాలం. ఐనా ఆడపిల్లలకు యెంతకాలం జరుగుతుంది పుట్టింట. వయస్సున రెండుసంవత్సరాలు పెద్ద లలితకన్నా రాజ్యం. ఆవారముందే కాపురానికి వెళ్లింది. ఇంటిదగ్గిర యిల్లు కావడంచేత యెంతో చమకారంగా వుండేవాళ్లు యిద్దరున్నూ. రాజ్యంచెప్పేమాటలకు యెంతో విలువ చూపించేది. వాళ్ల జీవితాల్లో "యెడమొహం," "పెడమొహం," గల ఘట్టాలు యెప్పుడూ జరగలా. అందుకనే వాళ్ల స్నేహలత పత్రజలంచేత శుష్కించకుండా మనోవృక్షాల్లో అల్లిబిల్లిగానల్లుకుంది.

లలిత ప్లీడరుగారిపిల్ల 1. ఇప్పటికి 18 యేండ్లుంటాయి. కాపురానికి వచ్చినప్పటినుంచి సతీపతులకు శృతికలవలా. "గాల"ని "ధూళ"ని యెన్నో వైద్యాలు చేయించారు. విసుగెట్టింది. అంటే తొలుచూరి బిడ్డ పడంచేత, ప్లీడరుగారు యెత్తెత్తుబంగారంగా పెంచి ఇష్టంవచ్చినట్లు స్వాతంత్ర్యమిచ్చాడు చిన్నతనంలో. ఆ రోజుల్లో అలవడ్డ నాగరికతా బీజాలు నేడు సతీపతులమధ్య విషబీజాలుగా మారినై.

లలిత భర్తపేరు సుందరం. సుందారానికి తల్లివగైరా అంతావున్నారు. తండ్రి చిన్నతనంలోపోయాడు. కాని గంపంతబలగంవుంది. పూర్వీకులు సంపాదించిన అగ్రహారాలవల్ల జీవనాధారం.

నాలుగుమూడు భాషల్లో వ్రాయను, చదువను, తెలుసును. కాని స్వభావసిద్ధమైన అలంకారాదులకే వాని హృదయపీఠంలో చోటుంది. ఆకారణంచేతనే, లలిత వేషభాషలంటే అసహ్యం అనిపించింది. తన మార్గాన్ని నిరోధించడంచేత లలితకున్నూ అంతే. మొదట్లో లలితపట్ల అనేకవిధాల అనుకున్నా, తర్వాత గ్రహించుకున్నారు పెడమూర్ఖతనమని గృహంలోనివారు.

ఒకరోజు విచారంతో ఆలోచించడం ప్రారంభించింది లలిత. యేమేమో ఉద్దేశాలు తట్టినై. యీ విషయమంతా రాజ్యానికి తెలియజేసి తదభిప్రాయంగా వెళుదామని నిశ్చయించుకుంది.......అప్పటికి వారం రోజులైంది ఉత్తరంవ్రాసి. సమాధానంరాలా. ఆదుర్దాపడింది. క్రిందటిరోజున తపాలాలోవచ్చిన వుత్తరాన్ని తీరెల్లాచదివి మళ్లాడ్రాయిరుమీద పెట్టేడు చెక్కుచెదరకుండా సుందరం. యేదోవిచారంతో గదిలో కెళ్లి తిరగడంలోకమ్మకంటబడింది లలితకు. బ్రహ్మానంద పడ్డది. గది తలుపులు గట్టిగాబిగించి మనస్సున చదవడం మొదలెట్టింది.

ప్రియమైన సోదరీ!...

నీవువ్రాసి పుత్తెంచిన వుత్తరమందినది. సంగతులు తెలుసుకొంటిని. శుష్కించిన చిన్ననాటి స్నేహపాదప మునకు, పత్రగంగోదక మిచ్చి మరింత పుష్టినిచ్చు నీలేఖిని ప్రశంసాపాత్రము. కమ్మ చదువునంతసేపును నీవు

సమీపముననున్నట్లే భావించితిని. మనము గొబ్బిళ్ల పండుగరోజులలో తోటిబాలికలకన్న ముందులేచి ప్రాతఃకాలమున "గుమ్మడిపూలనను, ఆవుపేడనను," పాతరలాడు నాటిదినములు నా మనోవీధి నొక్కసారి గోచరించెను. తల్లిదండ్రుల ప్రేమచే మృదుహస్తములలో మెలగు స్వాతంత్ర్యపు-బాలికలుగానున్న దినములు కదా మిక్కిలి పవిత్రములైనవి. సాంసారిక సుఖదుఃఖములనులోనుగాక అపరపరబ్రహ్మమూర్తులో యనభాసిల్లు శిశువులజీవితము ధన్యము చెల్లీ!

మీ సతీపతుల మధ్యనున్న యీ కలహనాటకము విషాదాంతముగా మారకుండునట్లు జాగరూకతతో వర్తింపుము. భవసాగరమున భార్యాభర్తలిరువురు ప్రయాణీకులు. జీవితములే నౌకలు. ధర్మార్థకామ మోక్షములు తీరములు. ప్రయాణమున ననుభవించు కష్టసుఖములను నిరువురునూ సమానభాగస్వాములే యగుదురు. అనుక్షణమును వివాదలను తావిచ్చినచో గమ్యస్థానమును చేరక విఫలమనోరథులగుదురు. ఇంతను పాశ్చాత్య వ్యామోహములచే సంక్రమించిన ఆచారములు మనల బద్ధులచేసినవి. నేటి నాగరిక భామినులనేకాక పూర్వాచారముల ననుష్ఠించు శ్రోత్రియకుటుంబ వృక్షములను సహితము యీ చీడపురుగు తప్పినదికాదు. కాని యేది యెట్లున్నను భర్తనుల్లఘించి వారి మనస్సు నసంతృప్తిపడునట్లు పెంకెపట్టుదలతో పెనగులాడు నీ సాహసము పరిహాసమునకు నావాసము. చేతులార చేసుకొను నీయకృత్యమును దైవికమనియు, కర్మయనియు, వాకొందువు. అది పట్టి తెలివితక్కువయని చెప్పదును. నాపై విసుగుకొనక ప్రశాంతముగా నాలోచించిన నీకే బోధయగును. అదిగాక భర్తకసహ్యముగాతోచు ననాగరికత లెవరికి? పతియేగతియని కదా, చంద్రమతి, దమయంతి, సావిత్రి మొదలగు సతీమతల్లులు తమతమ భర్తలతో అష్టకష్టములనులోనై సర్వసౌఖ్యములను మూరులైరి. వారివలె కాంతారములను నేగకయే ఇంటనుండి మహామహిమను సంపాదింపకల్గుదువే! అడకువతో పతిమాటలనేల యంగీకరింపవు? నీ నాధుడు చెప్పనట్లునడచిన నీకుగల్గుకష్టమేమి? వారు పూర్వాచార పరాయణులు. బూటకపు నాజూకన్న సుతలాంవారికి నచ్చదు. చూడగా మీ దాంపత్యము "కళాపూర్ణోదయములోని శాలీన సుగాత్రులకథ" జ్ఞాపకము తెచ్చుచున్నది.

బుజాలవఱకును తమ్మకాయలవలె వ్రేళ్లాడు ఆ "లోలాకుల" తీసినమాత్రమున లోపమేమి? మంగళప్రదమై వివాహవేళ అగ్నియెదుట ప్రమాణపూర్వకముగా మెడనుకట్టిన నల్లపూసలు మోటుగానుండినవని మెడనుండి తీయుటకు నెట్లు సాహసించితివి? "భూషణములు పుట్టినప్పుడు లేవుకదా. పెరిగినప్పుడేల" యని ప్రశ్నింతువు. యెంత వేదాంతము కలిగినది? నీవు ధరించెడి చీరె పుట్టినప్పుడే మెలను చుట్టబడివుండెనా? భారసాలరోజుననే జుట్టుముడికి పిన్నీసులచే బంధనమేర్పడెనా? లలితా! మెట్టెలు, పాదాభరణములు, ముక్కుపుడకలు, నొష్టకుంకుమ సహితము విసర్జించిన నీకొదవు లాభమేమి? అమంగళసూచకమే కాని నాజూకు కానేరదే! యెన్నడును పతివ్రతయైన కాంత వీటిని యేమరక రక్షించుచుండును. ఒకరేది ప్రారంభింతురో దానిని విమర్శింపకే వారి మతమును సులువుగా గొఱ్ఱె దాటుడువలె అనుకరింతుము. అది మనలోనున్న గొప్ప పొరపాటు. యేవి మనమనుష్ఠించిన ప్రమాదములు కానేరవో, యేవి సంఘమును, మానవ జీవితాశయములను భగ్నమొనర్ప యత్నింపవో, అవి పరిశీలనారూపమున ననుష్ఠించుట శ్రేయోదాయకము. భర్తకు శుభముగోరు యే పడతి, నాధుని సంపూర్ణారోగ్యమునుగోరు యే సత్సతి, పతి జీవించియుండగనే, వారి సాక్షాత్కారమున కంఠమున తాళివినాగా శరీరమునందుగల సర్వాభరణాదులదీసి, దీపపు శెమ్మెవోలె

మోడుగా నుండుటకు నిశ్చయించునా? పాశ్చాత్య నారీమణుల నాగరికతా వ్యామోహముచే సమ్మోహితులమై, నెంతయో పూర్వజ్ఞానశూన్యులమై, ప్రతిభ దఱిగియుంటిమి. చెల్లీ! మోచేతులవఱకును నీపతి చెప్పునట్లు రవికల కుట్టించుకొనకూడదా. నీకా చంకలవఱకనే పంతమెందుకు? నీకొఱకు నిత్యము తెచ్చు పూలను కొప్పునందు తుఱుముటకు నాజూకు కాదని ఆ నల్లటి వాడిదేరిన ఇనుపమొద్దు సూదుల గ్రుచ్చుకొనుట చూడ యెంతయో విషాదకరము. మొదట నిన్నాసినిమాలకు తీసుకొని త్రిప్పిన ఫలితము నాథుని కట్టికుడుపుచున్నది. మన పూర్వీకులు ఆరోగ్యపద్ధతులతో జతపఱచి కొన్ని సదాచారముల నెలకొల్పిరి. వాటిని నిస్సారముగా నీనాడు చూచి తత్ఫలితముల ననుభవింపుచుంటిమి. మోమును మిసమిసలాడు పసుపుచే తోముకొనుటకన్నను తెల్లటి విభూదివోలెనుండు దాని నద్దుటచే వచ్చిన అందమునకు విలువ నిర్ణయింపరానిదికదా! నా లలితా! నీవే తగిన శిక్షణను నేర్వనప్పుడు నీ సంతానమును నెట్లు తీర్చి దిద్దకలవు. సాంసారిక తాపత్రయములలో బడి దివారాత్రములు తిరుగాడు నీ పతి జీవితమున "శాంతి" యనునదెక్కడిది? నాథుని సంతృప్తిపఱచలేని నీవు గృహమున గల నాప్తుల తలలోని నాల్కవలె మెలగనేర్తువా? నీ ప్రవర్తన మెచ్చదగనిది. ఇదిమొదలు నామాట నంగీకరించిననే నీ కష్టసుఖములను దెల్పుము. తేమన్న......మగవారలు స్వాతంత్ర్యజీవులు. మన కెన్నటికిని స్వతంత్రత లేదు. స్వతంత్రముగా మనమున్న ఒకరందురని కాదు. అది మానవతులకు తగనిపని. మనము గృహలక్ష్ములు కాని, పురలక్ష్ములము కాముకదా. సమాన ప్రతిపత్తిని కలిగింపజేయలేదని పురుషులపై నిందమోపు టసభ్యము. మనలోపమును సవరించుకొనికదా యితరుల విమర్శించుట. మఱొకప్పుడు యీ విషయమై నీయెదుట తెల్పెద. ఆ మూలాగ్రముగా విసుగుచెందక చదువుము. నీవు సంపూర్ణముగా నచ్చిననే నా భావముతో నేకీభవింపుము. నాతోచినమాటలివి. ఇంతయును స్నేహముచే వ్రాయవలసివచ్చెను. మీబావ బజారునుంచి వచ్చే సమయమయింది......సెలవు."

స్వర్ణపురి,
9—11—1939.

నీ సోదరి,
రాజ్యం.

కాస్త కాస్త చొప్పున ఉత్తరమంతా పూర్తిగా చదువుకుంది. చేతులు వణుకుతున్నై. త్రాగిన కాఫీ నీళ్లన్నీ కళ్లల్లోంచి కారుస్తున్నది. లోకమంతా అంధకారంగా తోచింది. అవ్యక్తానికి చింతించుకుంది. పతిని లక్ష్యపెట్టక అశాశ్వతమైన యీ శరీర సౌందర్యమునకు యెంతటి ఘోరమైన కలతను, కళంకరహితమైన యీ కాపురానికి కల్పించితినని వగచింది. అన్నపానాదులకు నలజడిలేక—పూర్ణారోగ్యము కలిగి చదువుకున్న పతి లభ్యమైనను అనుభవించు యోగ్యత నోచుకొనని నా జీవితమెంత నికృష్టమైందని అనుకున్నది. నిలువుటద్దములో ప్రతిఫలించిన తనరూపు చూచుటకు పెద్ద తప్పుగా తోచింది. స్వరూపములో "వితంతువులకునూ, తనకునూ భేదమేచట" యని వితర్కించి నిట్టూర్పువిడిచింది. తన కెదురుగా వాకిలిపై వ్రేళ్లాడుతున్న భర్త పటాన్ని చేతబట్టుకుని వక్షస్థలానికి గట్టిగా నద్దుకుంటూ, మనస్సులో యేదో సంకల్పించి నిశ్చలచిత్తంతోటి ప్రమాణంచేసుకొంది లలిత...